

డాక్టర్లకు వైద్యశాలలో వసతి ఏర్పాటు చేయాలి:

ఆస్పత్రి ప్రాంగణంలో క్వార్టర్స్ ఏర్పాటు చేసి మహిళా డాక్టర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. క్వార్టర్స్ ఏర్పాటు చేస్తే డాక్టర్లు బయటకు వెళ్లే అవకాశం తక్కువగా ఉంటుంది. తమను తామే రక్షించుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా రోగులకు ఎక్కువ సేవలు అందించవచ్చు. కోల్‌కత్తా జూనియర్ డాక్టర్‌పై జరిగిన సంఘటన మరువలేకున్నాం. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలి.

డాక్టర్ పద్మావతి, డెర్మటాలజిస్ట్, ఏరియా వైద్యశాల, యర్రగొండపాలెం



ఆరోగ్య కేంద్రంలో భద్రత పెంచాలి:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు భద్రత పెంచాలి. కోల్‌కత్తా సంఘటనతో దేశంలో మహిళలకు రక్షణ కరువైందని అర్థమైంది. జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి రోజులు గడుస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దోషులను కఠినంగా శిక్షించాలి. వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి.

ఎం.సునీత, వైద్యాధికారి, దొనకొండ



క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి ప్రత్యేక పూజలు



పూజలు పూజలు చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

ముండ్లమూరు: మండలంలోని కొమ్మువరంలో బుధవారం శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద గ్రామస్తులు ఐక్యంగా ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభం ఏర్పాటు కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు వెంకాయమ్మకు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దొంగలు

త్రిపురాంతకం: వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి రాగి తీగ దొంగిలించడంతో రైతు లబోదిబోమంటున్నాడు. మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన దార్ల జార్జి తనకున్న ఐదెకరాల వ్యవసాయ భూమికి ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రాగి తీగ కోసం దుండగులు పగులగొట్టారు. వరినారుకు నీరు పెట్టుకునేందుకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసినట్లు గుర్తించి గ్రామస్తులకు తెలిపి వాపోయాడు. విషయంపై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

పాఠశాలలో నాటిన మొక్కలు



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెద్దారవీడు: మండలంలోని ఏనుగులదిన్నెపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎనీవ్హో ఫెడరేషన్ సౌజన్యంతో అజల్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం మొక్కలు నాటారు. పాఠశాలలో గతంలో నాటిన కోనో కార్పస్ మొక్కలను తొలగించి వాటి స్థానంలో నిమ్మ, నేరేడు, దానిమ్మ మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయుడు డి. నవీన్‌కుమార్ మాట్లాడుతూ కోనో కార్పస్ మొక్కలు నాటితే ఆరోగ్యపర చిక్కులు వస్తున్నాయని వాటిని తొలగించారు. పండ్ల మొక్కలు నాటితే భవిష్యత్తులో పిల్లలకు బలమైన ఆరోగ్యకర ఆహారాన్ని ఇవ్వగలమని చెప్పారు. ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, అజల్స్ సంస్థ చైర్మన్ కొటారి ప్రభుదాసు పాల్గొన్నారు.

వధూవరులకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆశీర్వాదం



వధూవరులతో బూచేపల్లి వెంకాయమ్మ

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట వైఎస్సార్ సీపీ కార్యకర్త చీరాల శ్రీకాంత్ వివాహానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులు శ్రీకాంత్, అమృతలకు అక్షతలు వేసి దీవించారు. ఆమె వెంట పార్టీ మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, గొంగటి పోలిరెడ్డి, చీరాల ఇశ్రాయేలు, గుంటు పోలయ్య, యండూరి గురవయ్య ఉన్నారు.

వ్రతానికి హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి



వెంకాయమ్మను ఆహ్వానిస్తున్న కుటుంబ సభ్యులు

దర్శి: స్థానిక పుచ్చల మెట్టలోని దారం కొండా నూతన గృహ ప్రవేశం సందర్భంగా నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ బుధవారం హాజరయ్యారు. జిల్లా ప్రజలను భానుడి తాపం నుంచి కాపాడి, వరుణుడి కరుణ కలిగేలా చూడాలని ఆమె భగవంతుడిని వేడుకున్నట్లు చెప్పారు. అనంతరం అందరినీ ఆప్యాయంగా పలకరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. కొమరోలు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ లైన్‌లో కొత్త లైన్‌ను వేస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు.

కోతులతో బెంబేలు



దర్శి పట్టణంలో తిరుగుతున్న కోతులు



అరటి చెట్టు పీకేసిన కోతి



ఇళ్లపై తిరుగుతున్నకోతులు

- దర్శి పట్టణ వాసుల ఆందోళన
- మహిళలు, చిన్నారుల వెంట పడుతున్న కోతులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని నగర పంచాయతీ పాలకులు

దర్శి: పట్టణంలో కోతులు బెడద తీవ్రంగా ఉంది. మహిళలు నగర పంచాయతీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. కోతులు నానా యాగీ చేస్తున్నాయి. నివాలసాల వద్ద ఎంతో ప్రేమగా పెంచుకునే మొక్కలను తుంచేస్తున్నాయి. పదుల సంఖ్యలో అరటి చెట్లను పట్టుకుని వేలాడి విరగ్గొడుతున్నాయి. అప్పుడే వేసిన అరటి గెలలను సైతం తుంచేస్తున్నాయి. పండ్ల మొక్కల చెట్లపైకి ఎక్కి పిందెలను పీకి కిందేయడం వంటి కోతుల చేష్టలకు పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. నివాసాల బయట పెట్టుకునే ముగ్గు డబ్బాల్లో ముగ్గు పారబోయడం, చెత్త డబ్బాల్లో వేసిన చెత్తను కింద పోయడం వంటి చిలిపి చేష్టలు చేస్తున్నాయి. ఎవరైనా కర్ర పట్టుకుని బెదిరించినా ఉలుకు పలుకు లేకుండా ఉంటున్నాయి. మహిళలను చూస్తే నోరు తెరిచి ఫీంకరిస్తున్నాయి. పదుల సంఖ్యలో ఒకేసారి కోతులు రావడంతో అవి కరుస్తాయేమోనని తలుపులు వేసుకుని ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. మహిళలు బయట నుంచి ఏవైనా సరుకులు వంటి కవర్లు తీసుకుని వస్తూ కనిపిస్తే చాలు వారిపై ఎగబడి చేతుల్లో ఉన్నవి లాక్కుంటున్నాయి. ఇంటి బయట ఉన్న చెప్పులు తీసుకెళ్తున్నాయి. పిల్లలను స్కూల్‌కు పంపాలన్నా, క్యారేజీలు తీసుకుని వెళ్లాలన్నా కోతులు ఉన్నాయా లేదా అని కాపలా కాసి బయటకు రావాల్సిన పరిస్థితి ఉందని అద్దంకి రోడ్డులో మహిళలు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని పలు మార్లు షోషల్ మీడియా, పత్రికల్లో ప్రచురించి కోతుల బారి నుంచి కాపాడండని వేడుకుంటున్నా నగర పంచాయతీ అధికారులు, పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేకపోవడం గమనార్హం. నగర పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోకుంటే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పండ్ల చెట్ల కొమ్మలు పట్టుకుని వేలాడుతున్న కోతులు

మట్టి గణపతే పర్యావరణానికి రక్ష



వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న సుబ్రహ్మణ్యం

పుల్లలచెరువు: వినాయక చవితి వచ్చిందంటే పిల్లల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా విగ్రహాలు ఏర్పాటు చేసి పూజిస్తారు. వర్షాలు సుభిక్షంగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సంతోషంగా జీవించాలని, కోరిన కోర్కెలు నెరవేరాలని గణపయ్యను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా వినాయ విగ్రహాలను ఏర్పాటు చేసి చలువ పందిళ్లు వేసి, రంగు కాగితాలు, విద్యుద్దీపాలతో ఆధ్యాత్మిక భావాలతో కనీసం 12 రోజుల పాటు పెద్దలు, పిల్లలు సైతం పల్లెల్లో ఉత్సాహంగా పూజలు చేసి నిమజ్జనం చేస్తారు.

పీఓపీతో కాలుష్యం

వినాయక చవితి వస్తే గ్రామాలు, పట్టణాల్లో పీఓపీతో తయారు చేసిన వివిధ ఆకృతిలో ఉన్న అతి పెద్ద విగ్రహాలను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడంతో ఆ నీటిని పశువులు మూగజీవాలు తాగి అనారోగ్యం పాలవుతున్నాయి. అందుకోసం మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజిస్తే మంచిదని సోషల్ మీడియా, స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

మట్టి గణపయ్యలనే పూజించాలి

ప్రతి సంవత్సరం పుల్లలచెరువులో సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి వినాయకుని మట్టి విగ్రహాలు తయారు చేసి సాధారణ ఖర్చులు తీసుకుని వాటిని భక్తులకు ఇచ్చేవాడు. ఈ సంవత్సరం కూడా వినియోగదారులకు తక్కువ ధరలకే విగ్రహాలు తయారు చేసి పండగకు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నాడు. ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి ఇబ్బంది లేకుండా ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలు వాడితేనే మేలు జరుగుతుంది.

> **మట్టి విగ్రహాలను పూజిద్దాం:**
> వినాయక చవితి రోజు ప్రజలంతా మట్టి వినాయక విగ్రహాలను పూజించేలా చూడాలి. మట్టి విగ్రహాలతో పూజలు చేసి కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. చిన్న పిల్లలను పెద్దలు ఆ దిశగా ప్రోత్సహించాలి.
> **ఎం.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు, పుల్లలచెరువు**

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేలా కృషి చేయాలి



విద్యార్థుల పుస్తకాలు తనిఖీ చేస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఇందిరాప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని యండ్రపల్లి యూపీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను అధ్యయనం చేసుకుని ఆధునిక పద్ధతిలో అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి విద్యార్థి తప్పని సరిగా రాయడం, చదవడం నేర్చుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు చూడాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల నోట్‌బుక్‌లు చూడాలని చెప్పారు. ప్రభుత్వ నియమాలు పాటిస్తూ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులు అంతా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యంగా, రుచి, శుచిగా ఉండేలా ఉపాధ్యాయులు చూడాలని ఎంఈఓ ఆదేశించారు.

రైతులు సబ్సిడీ పథకాలు వినియోగించుకోవాలి



రైతుకు సలహాలు ఇస్తున్న హెచ్ఓ శ్వేత

బేస్తవారిపేట: ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో అందించే సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత అన్నారు. బుధవారం మండలంలోని ఒందుట్లలో బత్తాయి, మామిడి, టమోట పంటలను ఆమె పరిశీలించారు. కూరగాయాలు, పండ్ల తోటల్లో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు హెక్టార్ మల్చింగ్‌కు రూ.16 వేలు, రెండు హెక్టార్లకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత నీటి కుంటలకు 50 శాతం రాయితీ రూ.75 వేలు, కమ్యూనిటీ నీటి కుంటలకు 100 శాతం రాయితీ రూ.20 లక్షలు మించకుండ ఇస్తున్నట్లు వివరించారు. పండ్ల తోటల వద్ద పంట సేకరణ, నిల్వకు, ప్యాకింగ్ చేసుకునేందుకు 50 శాతం సబ్సిడీపై ప్యాక్ హౌస్ యూనిట్‌కు రూ.2 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పండ్ల తోటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాఫ్ బుకింగ్ చేయించుకోవాలని కోరారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి



ఈ-పంట రికార్డును పరిశీలిస్తున్న తహసీల్దార్



ఈ-పంట నమోదు చేస్తున్న ఏవో శేషారెడ్డి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ బాలకృష్ణనాయక్

యర్రగొండపాలెం: రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని మొగుళ్లపల్లి, వాదంపల్లి, వీరభద్రాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వీఏవో, వీహెచ్ఏ, వీఆర్వోలతో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పొలం వద్దకు వెళ్లి వారు సాగు చేస్తున్న పంటలను ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలన్నారు. రైతులు తమ పంటలను నమోదు చేయించుకుంటే ప్రకృతి వైపరీత్యాలతో జరిగే పంట నష్టం, బీమా సౌకర్యం వర్తించే అవకాశం ఉందన్నారు. ఏఈవో మాల్యాద్రిరెడ్డి, వీఏఏలు వివేక్, జాషువ, రమేష్, సర్వేయర్ రాజు నాయక్ పాల్గొన్నారు.

దర్శి: ప్రస్తుత వర్షాభావంతో పంటలు బెట్ట స్థితి నెలకొని ఎండు దశకు చేరుకుంటున్నాయని, వాటిని తాత్కాలికంగా కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి బాలకృష్ణనాయక్ సూచించారు. మండలంలోని చందలూరు, బసిరెడ్డిపల్లె, బండి వెలిగండ్ల గ్రామాల్లోని పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. కంది, పత్తి పంటలను పరిశీలించి బెట్ట స్థితి నుంచి కాపాడుకోవటానికి 19:19:19 నీటిలో కరిగే ఎరువును 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేస్తే కొద్ది రోజులు పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. రసం పీల్చే పురుగు ఉధృతిని, తెల్లదోమ పచ్చ దోమ నివారించడానికి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ప్రతి రైతు తప్పకుండా పంటలను పంట నమోదు చేయించుకోవాలని కోరారు. పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను, ప్రతి సర్వే నంబరును పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు చేయించుకుంటే వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే ప్రతి పథకం రైతులు లబ్ధి పొందచ్చని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు జాన్, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రకాంత్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: ఈ ఏడాది ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ బి.రమాదేవి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని గంగదేవిపల్లిలో ఆమె రైతులతో మాట్లాడారు. జియో రెఫరెన్స్ విధానంలో పొలం అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా నమోదు చేస్తారని తెలిపారు. రైతులు వాస్తవంగా సాగు చేసిన పంటను మాత్రమే నమోదు చేయాలన్నారు. ఏ రోజు ఏ సర్వే నంబర్లలో పంట నమోదు చేయబోతారో ఒక రోజు ముందుగానే రైతులకు తెలియజేయాలన్నారు. రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది కలిసి రైతులతో ఐక్యంగా ఉండి ఈ-పంట నమోదును తప్పనిసరిగా వేగవంతం పెంచాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఓటరు అప్‌డేట్ ప్రక్రియను తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యోగయ్య మఠంలో ప్రత్యేక పూజలు



మఠం ప్రాంగణంలో హోమం చేస్తున్న భక్తులు



స్వామివారి చిత్రపటం, యంత్రం మఠానికి తీసుకొస్తున్న భక్తులు

కురిచేడు: స్థానిక శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి (యోగయ్య) మఠంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు సుబ్బయ్య శాస్త్రి, విశ్వనాథశాస్త్రిల మంత్రోచ్ఛరణల మధ్య, మఠం ప్రాంగణంలో హోమం చేశారు. ఆలయ నిర్మాణం కోసం స్వామివారి చిత్రపటం, పాదుకలు సమీపంలో శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో భద్రపరిచారు. ఆలయ నిర్మాణం దాదాపు పూర్తి కావడంతో స్వామివారి పాదుకలు, చిత్రపటం తిరిగి ఆలయానికి చేర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తేడాలుంటే సీజ్ చేస్తాం

తాళ్లూరు (దర్శి): మండలంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపులను నిరంతరం తనిఖీ చేస్తామని, వాటిల్లో తేడాలుంటే సీజ్ చేస్తామని మండల వ్యవసాయాధికారి బి. ప్రసాదరావు హెచ్చరించారు. తూర్పుగంగవరంలోని శ్రీ శ్రీనివాస ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ షాపును ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సరుకు నిల్వలు సమంగా ఉన్నాయా? లేదా అని సరి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం తనిఖీలు నిర్వహించి నాణ్యత లోపం ఉంటే వాటిని రీ ఎనాలిసిస్‌కు పంపిస్తామని, వాటిలో కూడా ఫెయిల్ అయితే యాక్టు ప్రకారం సరుకును, సంబంధిత రికార్డులను సీజ్ చేసి కోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. నిరంతరం తనిఖీలతో నాసిరకం సరుకు, అనుమతులు లేని ప్రొడక్ట్స్ తెచ్చి అమ్మేందుకు అవకాశం ఉండదన్నారు. తద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగ మందులు, విత్తనాలు అందుతాయని తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల యూనియన్ అధ్యక్షుడిగా చెన్నారెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

యర్రగొండపాలెం: నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యా యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ యూనియన్ అధ్యక్షుడిగా ఎం.చెన్నారెడ్డి, ఉపాధ్యాక్షురాలిగా ఎం.పద్మజ, కార్యదర్శిగా ఎం.మల్లికార్జున, సహాయ కార్యదర్శిగా యూ.రమణయ్య, కోశాధికారిగా ఎ.వెంకటేశ్వరరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కె.హనుమంతరావు, డి.శ్యామల, పి.నాగేశ్వరరావు, ఎస్.సంజీవరెడ్డి ఎన్నికైనట్లు ఆ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సాలిగ్రాం ప్రకటించారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా ప్రతిష్ఠించిన పోలేరమ్మ విగ్రహం



పోతురాజుస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని సిద్ధవరం గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ ఆగమ పండితుడు పోతులూరి శివరామాచార్యస్వామి శిష్య బృందం విగ్రహమూర్తులను ప్రతిష్ఠించింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

కిరాణా, ఫ్యాన్సీ దుకాణాలపై దాడులు

త్రిపురాంతకం: కిరాణా, ఫ్యాన్సీ దుకాణాలపై తూనికలు కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. త్రిపురాంతకంలోని కిరాణా, ఫ్యాన్సీ దుకాణాలపై దాడులు చేసిన మార్కాపురం, పొదిలి తూనికల అధికారులు షేక్ రియాజ్, షేక్ మొహ్‌సిన్ దాడుల్లో పాల్గొన్నారు. దుకాణదారులకు రూ.40 వేల జరిమానా విధించారు. దుకాణదారులు నిబంధలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

కొనకనమిట్ల: రైతులు ఆధునిక పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఎ.శైలజ, దర్శి ఏడీఏ బాలాజీనాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మునగపాడు, పెదారికట్ల రైతు సేవా కేంద్రాల్లో ×ఆత్మ¥ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. పంటల సాగులో మెళకువలు పాటించి, అధిక దిగుబడి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.